మర్కజీ జంక్షన్ అస్తవ్యస్తం

- నిత్యం ట్రాఫిక్ జామ్
- ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం
- విస్తరణతోనే సమస్యకు పరిష్కారం


అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు





నయీంనగర్: ఒకవైపు నగరాన్ని సకల హంగులతో సుందరంగా తయారు చేయడానికి కుడా, జీడబ్ల్యూఎంసీ, స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేస్తుంటే, మరోవైపు అక్రమార్కులు, కబ్జాదారులు నగరాన్ని మరింత భ్రష్టు పట్టిస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ ఖాళీ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, కూడళ్లను ఆక్రమిస్తూ వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు.

ఇరుకు రోడ్డుపై ఇబ్బందులు

నగరంలో రద్దీగా ఉండే జీఎంహెచ్ మర్కజీ స్కూల్ జంక్షన్‌లో ఎట్టకేలకు ఇటీవల ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అయితే ఈ కూడలి ఇరుకుగా ఉండడంతో సిగ్నల్ పడినప్పుడు ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు ఫ్రీ లెఫ్ట్ వెళ్లడానికి దారి లేక వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంక్షన్ నుంచి మార్కెట్ దారిలో అక్రమంగా ఇరువైపులా పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లు, ఆటో అడ్డా, డబ్బాలు, టైర్ పంక్చర్ షాపుల ఏర్పాటుతో రోడ్డు ఇరుకుగా మారింది. హాకర్లకు పబ్లిక్ గార్డెన్, ఎల్‌బీహెచ్‌ఎస్ స్కూల్ వద్ద మడిగెలు కేటాయించినా వాటిని వినియోగించుకోకుండా మర్కజీ జంక్షలో వ్యాపారాలు చేస్తూ ప్రజలకు తీవ్ర ఇక్కట్లు కలిగిస్తున్నారు. పెట్రోల్‌పంపు నుంచి వచ్చే స్కూలు బస్సులు, మోస్తరు పెద్ద వాహనాలు డబ్బాల్ జంక్షన్ వైపు వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మర్కజీ స్కూల్ వద్ద ఆక్రమణలతో వాహనాలు మూల తిరగడం లేదు. ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. జంక్షన్‌లో ప్రధాన రహదారి 150 ఫీట్లు ఉండాల్సి ఉండగా 80 ఫీట్ల వెడల్పు కూడా లేదు.

దృష్టి సారించని అధికారులు

గతంలో ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ప్రహరీని కూల్చి రోడ్డును విస్తరించారు. ఇక్కడ నాలుగు వైపులా వెడల్పు చేయడానికి అవకాశం ఉన్నా ప్రజా అవసరాలు పట్టించుకోని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు సెట్ బ్యాక్ కాకుండా పాత భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మిస్తే నగర నడిబొడ్డున ఉన్న మర్కజీ జంక్షన్ అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉంది. వెంటనే కూడలిని వెడల్పు చేసి అభివృద్ధి చేయాలని నగరవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

జంక్షన్‌ను అభివృద్ధి చేయాలి



గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ నగరంలో పెరుగుతున్న జనాభా, ప్రజా అవసరాల కోసం కూడళ్లను అభివృద్ధి చేయాలి. మర్కజీ జంక్షన్ ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈక్రమంలో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కూడలిని సుందరీకరించాలి.

– పాశికంటి రాజేంద్రప్రసాద్, బీజేపీ నాయకుడు

పుస్తక పఠనంతో మెరుగైన సమాజం


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రియాజ్, తదితరులు

హన్మకొండ చౌరస్తా: పుస్తక పఠనం ద్వారానే మెరుగైన సమాజ నిర్మాణం జరుగుతుందని, ఈక్రమంలో ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ రియాజ్ సూచించారు. జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా హనుమకొండ అశోకా కాంప్లెక్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన నవచేతన పుస్తక ప్రదర్శనను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నవచేతన పబ్లిషింగ్ హౌజ్ ప్రచురించిన సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన తెలంగాణ చరిత్ర, ప్రముఖ న్యాయవాది ఏరుకొండ జయశంకర్ రాసిన చెదిరిన స్వప్నం రాజీవ్ అనే పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రముఖుల పుస్తకాలను నవచేతన బుక్‌హౌస్ పాఠకులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని ప్రశంసించారు. బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ ఈనెల చివరి వరకు కొనసాగున్న పుస్తక ప్రదర్శనలో ప్రతీ పుస్తకంపై 10 నుంచి 30శాతం రాయితీ అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, బుక్‌హౌస్ సిబ్బంది తాండూరు గోపి, అకినపల్లి రమేష్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు పత్రికలు


సమావేశంలో మాట్లాడుతున్న సంగని మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు పత్రికలు అని కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1956, నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పడిందని వివరించారు. అప్పటి నుంచి ప్రతీఏడాది నవంబర్ 16ను జాతీయ పత్రిక దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్యాయాలు, అవినీతి, అక్రమాలను వెలికితీసి కథనాలు రాసే బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని గుర్తుచేశారు. పత్రికలు నిజాన్ని నిర్భయంగా, స్వేచ్ఛగా, రాజకీయాలకు అతీతంగా రాయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, నర్సింహరాములు, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ మోటె చిరంజీవి, సురేందర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సెక్యులర్ పార్టీ భారత్ రాష్ట్ర సమితి


సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్

హన్మకొండ: సెక్యులర్ పార్టీ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మాత్రమేనని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీ రుణాలు మాయమయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన మైనార్టీ రుణాలను సైతం కాంగ్రెస్ నిలిపివేసిందని వాపోయారు. మహిళలకు కుట్టు మిషన్లు అందజేసే కార్యక్రమాన్ని కూడా ఎగవేసిందని, మైనార్టీల సంక్షేమాన్ని పట్టించుకోకుండా, వారి హక్కులను కాపాడడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమయిందని పేర్కొన్నారు. మైనార్టీలు సాధించుకున్న షాదీఖానా నిర్మాణాన్ని ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు నయీమొద్దీన్, సయ్యద్ మసూద్, ఇస్మాయిల్, ఖలీల్, తస్లీమ్, గౌస్‌ఖాన్, అహ్మద్, అబిద్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సంధ్యారాణికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బండి సంధ్యారాణికి హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సింథిసిస్ అండ్ బయాలజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ పిరిడో పిరమిడిన్ కంటైనింగ్ 1, 2, 3 ట్రయోజోల్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సంధ్యారాణికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ నర్సింహ పర్యవేక్షణలో సంధ్యారాణి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈమేరకు సంధ్యారాణిని కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రజనీలత, విభాగం అధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు అద్దె భవనాలల్లో, అరకొర సదుపాయాల మధ్య కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి జశ్వంత్, బాధ్యులు మల్లేష్, భరత్, అజయ్, సాయికుమార్, రాహుల్, సూరత్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



హాజరైన శశిజాదేవి, అతిథులు

హన్మకొండ చౌరస్తా: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రంథాలయ కార్యదర్శి శశిజాదేవి హాజరయ్యారు. పచ్చదనం – పరిశుభ్రత అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాల, మర్కజీ ఉన్నత పాఠశాల, సెయింట్ గ్యాబ్రియల్, ఆర్యభట్ట తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కరుణకుమారి, గ్రేడ్ –2 లైబ్రేరియన్ మల్హార్, గ్రేడ్ –3 లైబ్రేరియన్ పురుషోత్తం రాజు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, టైపిస్టు కుమారస్వామి, న్యాయ నిర్ణేతలు సాగంటి మంజుల, నిమ్మల శ్రీనివాస్, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దక్షరెడ్డికి బాల కళారత్న అవార్డు



హన్మకొండ కల్చరల్: హనుమకొండ కనక దుర్గ కాలనీకి చెందిన రొండ్ల దక్షరెడ్డి ప్రతిష్టాత్మక బాల కళారత్న అవార్డును అందుకుంది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు బాల కళావేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి కూచిపూడి కళాకారులకు చిల్డ్రన్ డ్యాన్స్ ఒలింపియాడ్ –2024 మూడు రోజుల పాటు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని దక్షరెడ్డి అందుకుంది. అలాగే, సబ్ జూనియర్స్ విభాగంలో హనుమకొండకు చెందిన వేదంశీ, శరణ్యప్రియ.. అవార్డులు అందుకున్నారు.

గ్రేటర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


అసోసియేషన్ నూతన కార్యవర్గం

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఎన్నిక శుక్రవారం సాయంత్రం హనుమకొండలో జరిగింది. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా కర్రు రమేష్, ప్రధాన కార్యదర్శిగా గొలుసుల సంపత్, కోశాధికారిగా పంచగిరి మాధవ శంకర్, ఉపాధ్యక్షులుగా సూర హరికృష్ణ, జి.సంతోష్ నాయక్, జాయింట్ సెక్రటరీగా అప్పాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అధ్యక్షుడు కర్రు రమేష్ మాట్లాడుతూ నగర పరిధిలో ఉన్న కాంట్రాక్టర్ల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత


విద్యార్థులతో అనితారెడ్డి

విద్యారణ్యపురి: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి గుర్తుచేశారు. కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని మాసాయి బోధి వృక్ష స్కూల్‌లో స్టాండ్ ఫర్ చైల్డ్ రైట్స్ – నో చైల్డ్‌లెఫ్ట్ బిహైండ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. బాలల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు మానస, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వాల్‌పోస్టర్లను హంటర్‌రోడ్డులోని కార్యాలయంలో జిల్లా మహాసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బయ్య స్వామి, పులి రజనీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న ప్రతీపల్లెలో ముదిరాజ్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె బోయిన అశోక్, బండి సారంగపాణి, జోరుక సదయ్య, గట్టయ్య, బుస్స మల్లేషం, సోమయ్య, నీల రాజు, దువ్వ కనకరాజు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడు, మంత్రులకు ఘన స్వాగతం

కాజీపేట: పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు నగరానికి శనివారం విచ్చేయగా వారికి యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి తక్కలపల్లి సాగరికరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల రమాకాంత్ రెడ్డి.. ఫాతిమానగర్ చౌరస్తాలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ నాయక్, అభినయ్, లక్ష్మణ్ నాయక్, లింగమూర్తి, ప్రశాంత్, రమేష్, రవి, నరేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హసన్‌పర్తిలో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, సురేందర్ రెడ్డి, తిరుపతి, మహేందర్‌రెడ్డి, రవి, నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు

వరంగల్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను మైనార్టీ జిల్లా నాయకుడు మహ్మద్ అయూబ్, తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.

టీ హబ్‌కు తాళ్ల పద్మావతి విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ వైష్ణవి

ఖిలా వరంగల్: సెప్టెంబర్ 13న నిర్వహించిన రబోక్సియాన్ రాష్ట్రస్థాయి వర్క్‌షాపు, పోటీల్లో తాళ్ల పద్మావతి అంతర్జాతీయ పాఠశాల నుంచి ఆరు గురు విద్యార్థులు తెలంగాణ టీ హబ్‌కు ఎంపికయ్యారని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం తెలిపారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన మునాజ, అఫియా, నిత్యశ్రీ, శాదాబ్, అభిజిత్, కీర్తనను చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు వైష్ణవి, వరుణ్, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

నేడు టీపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

విద్యారణ్యపురి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని రంగశాయిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 17న ఉదయం నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్‌కుమార్ గౌడ్ శనివారం తెలిపారు. ముఖ్యఅతిథిగా టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, ఎన్నికల అధికారిగా టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కవిత పాల్గొంటారని తెలిపారు. టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరగనున్న సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



మడికొండ: మడికొండలోని వినాయకనగర్‌కు చెందిన నార్లగిరి వనజ ఇల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. కమిటీ సభ్యులు కాశేశ్వరపు సునీత, జానపట్ల అనసూర్య, జిట్ట రమ, కాగితాల ప్రవళిక, చెనమల్ల రేణుక, కాశి రజిత, కాగితం సౌందర్య పాల్గొన్నారు.

వ్యాపారి కుటుంబానికి చేయూత



వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని ఆకుకూరల వ్యాపారి వాసం సదానందం ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను కూరగాయల మార్కెట్‌లోని తెలంగాణ పొదుపు, మార్కెటింగ్ సహకార సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సహకార సంఘం బాధ్యులు సామల రాజు, మంద రంజిత్, కొండా హరి, పంచగిరి రమేష్ పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయాలి

నయీంనగర్: అణగారిన వర్గాలకు ఉచిత విద్య, వైద్యం, ఇల్లు, భూమి, ఉపాధి ప్రభుత్వమే కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు మంద రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలని పార్టీ పోరాటం చేస్తోందని అన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం జరిగే వరకు వివిధ రూపాల్లో పోరాటం చేస్తుందని అన్నారు. రత్నాకర్, రవి, యేసోబు, జయపాల్, నరేష్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోస్టర్ల ఆవిష్కరణ



వరంగల్ లీగల్: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీపీసీసీ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, రాజ్యాంగ ప్రాముఖ్యత అనే అంశంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు ఆసక్తి గల న్యాయవాదులు పాల్గొనాలని కోరుతూ వరంగల్ కోర్టు ప్రాంగణంలో కరపత్రాలను ఆవిష్కరించారు. టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ముదసిర్ అహ్మద్, క్వాయిమ్, గునగంటి శ్రీనివాస్ గౌడ్, వేముల రమేష్, కుమార్, రంజిత్ గౌడ్, కొక్కొండ రమేష్, గన్ను హరి, కుమార్, రజినీకాంత్, రవీందర్, సురేష్ పాల్గొన్నారు.

'సదానందం'కు సన్మానం



హన్మకొండ: ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగాని సదానందం గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. హనుమకొండ నయీంనగర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, నాయకులు కోలా ప్రతాప్, పెరుమాండ్ల అనిల్, పంజాల మధు, బొమ్మగాని ఆదర్శ్, సుమన్, విక్రమ్ పాల్గొన్నారు.

రైలుకింద పడి ఆత్మహత్య

ఖమ్మం క్రైం: ఖమ్మం మధ్యగేట్ ప్రాంతంలో రైలు కిందపడిన వరంగల్ వాసి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన వేల్పుల మురళీకృష్ణ(40) శనివారం ఖమ్మం వచ్చినట్లు సమాచారం. ఆతర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ ఆయన రైలు కింద పడగా మృతదేహం ఛిద్రమైంది. మురళీకృష్ణ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మురళీకృష్ణ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు.

సంక్షిప్తంగా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు ఎలాంటి గొడవలు, చట్ట విరుద్ధమైన వివాదాల్లో తలదూర్చవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

జేఎల్‌లకు నియామక పత్రాలివ్వండి

కేయూ క్యాంపస్: ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లగా ఎంపికైన తమకు నియామక పత్రాలు ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జూనియర్ లెక్చరర్లు కోరారు. ఈమేరకు మంత్రులు శ్రీధర్‌బాబు, ప్రభాకర్, సురేఖను నగరంలో శనివారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. అలాగే, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. డాక్టర్ లింగ నాయక్, సతీష్, మనోజ్, యాకూబ్‌పాషా, కాంతయ్య, వంశీకృష్ణ, రాజేష్, రమేష్, శ్వేత, శ్రీకాంత్ చారి, వీరేందర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆటోను ఎత్తుకెళ్లిన దొంగ అరెస్ట్

కాజీపేట: పట్టణంలోని రహమత్‌నగర్‌లో ఈనెల 5న పార్క్ చేసిఉన్న ఆటోను దొంగిలించిన నిందితుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు. మడికొండ గ్రామానికి చెందిన భూక్య రాజేష్ ఆటోను కమలాపూర్ గ్రామానికి చెందిన మాటేటి రమేష్ అపహరించాడు. కడిపికొండ బ్రిడ్జి వద్ద వాహనాలను శనివారం తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి రమేష్ పారిపోతుండగా అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ ఆటోను హైదరాబాద్‌లో విక్రయించడానికి వెళ్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఆటో అపహరణ

వరంగల్: ఈనెల 13వ తేదీ రాత్రి వరంగల్ ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలోని మడిపల్లి బార్ ఎదురుగా నిలిపిఉన్న టీఎస్02 యూబీ 0931 నంబర్ గల ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించాలని ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. బాధితుడు డ్రైవర్ నమిండ్ల ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మడికొండ: ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన బొజ్జ సమ్మయ్య యాదవ్ ఈనెల 11వ తేదీన ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని పార్కు చేశారు. మరునాడు ఉదయం చూసేసరికి అది కనిపించలేదు. దాంతో మడికొండ పోలీసు స్టేషన్‌లో బాధితుడు శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిషన్ తెలిపారు.

నేడు సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్

కాజీపేట అర్బన్: సీపీ స్టార్ టాలెంట్ టెస్ట్ –25ను న్యూశాయంపేటలోని వరంగల్ బ్రాంచ్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు వరంగల్ బ్రాంచ్ చైర్మన్ కరుణాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఏసీపీని కలిసిన పద్మశాలి సంఘం నేతలు

వరంగల్: జిల్లా పద్మశాలి సంఘం కార్తీక వనభోజనాల ఆహ్వాన కమిటీ నేతలు శనివారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్‌ను కలిశారు. ఖిలా వరంగల్ కోట వాకింగ్ గ్రౌండ్‌లో 10ఏళ్లుగా ఏర్పాటు చేస్తున్న పద్మశాలి కార్తీక వనభోజనాల కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరారు.